క్లుప్తంగా

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

తుని: పట్టణ పరిధిలోని ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తుని పట్టణ సీఐ. ఎం.నాగదుర్గారావు హెచ్చరించారు. పట్టణంలో నివాస ప్రాంతాల్లో ఉంటున్న ట్రాన్స్‌జెండర్లకు గురువారం ఆయన కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రజలు స్వచ్ఛందంగా ఆర్థిక సహాయం అందిస్తే తీసుకోవాలే తప్పా, బలవంతం చేయవద్దన్నారు. కొన్ని ప్రాంతాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు పలు ఫిర్యాదులు అందాయన్నారు. ఇకపై ప్రజలను ఇబ్బంది పెట్టినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సెల్ టవర్ ఎక్కి వ్యక్తి నిరసన



సెల్ టవర్ ఎక్కి నిరసన తెలుపుతున్న శ్రీనివాసరావు

ఏలేశ్వరం: పట్టణంలో డ్రైన్ల నిర్మాణం కోసం అధికారులు ఆక్రమణలు తొలగిస్తున్నారు. పట్టణానికి చెందిన శిడగం శ్రీనివాసరావు షాపులను ఆక్రమణల్లో భాగంగా సుమారు పదిరోజుల క్రితం అధికారులు తొలగించారు. దీనికి నిరసనగా బుధవారం స్థానిక షిర్డీ నగర్‌లో శ్రీనివాసరావు సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపాడు. దీంతో పట్టణ సీఐ కిషోర్‌బాబు, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు అతనితో సంప్రదింపులు జరిపారు. ఉన్నతాధికారులు ఆదేశాలతో పునరావాసం కల్పిస్తామని అధికారులు హామీ ఇవ్వడంతో అతను సెల్ టవర్ నుంచి దిగి నిరసన విరమించాడు. కార్యక్రమంలో ఎస్సై జి.సతీష్, ప్రత్తిపాడు అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

జగదానందం సేవలు చిరస్మరణీయం



సంస్మరణ సభలో జగదానందం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

తుని: స్థానిక చక్కా శ్రీరామ్మూర్తి స్మారక మున్సిపల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పని చేసి ఇటీవల మృతి చెందిన చక్రవర్తుల జగదానందం సేవలు చిరస్మరణీయమని పలువురు వక్తలు కొనియాడారు. స్థానిక చక్కా శ్రీరామ్మూర్తి మున్సిపల్ పాఠశాలలో గురువారం ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో జగదానందం సంస్మరణ సభ నిర్వహించారు. 1980 నుంచి 2001 వరకూ ఇక్కడ హెచ్‌ఎంగా పని చేసిన చక్రవర్తుల జగదానందం విద్యను ప్రోత్సహించారన్నారు. పిల్లలకు పొదుపుపై అవగాహన కల్పించారని సహచర ఉపాధ్యాయుడు కుక్కుటేశ్వరరావు గుర్తు చేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు చెల్లారావు, నాగ భూషణరావు, సత్యనారాయణ, వరహాలు, లక్ష్మి శాంతి పాల్గొన్నారు.

నిత్యావసర సరకుల పంపిణీ



చిల్లంగిలో బాధితుడు శ్రీనివాస్‌కు నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న అయ్యప్ప సేవకులు

కిర్లంపూడి: అయ్యప్పస్వామి పుట్టినరోజును పురస్కరించుకుని 'అందరి బంధువులం–అయ్యప్ప సేవకులం' ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. మండలంలోని చిల్లంగి గత కొన్నేళ్లుగా కంటి సమస్యతో బాధపడుతున్న కాళ్ల శ్రీనివాస్, సింహాద్రిపురంలో కరెంట్ స్తంభంపై నుంచి పడిపోయి మంచానికే పరిమితమైన పీతల సత్యనారాయణకు ట్రస్ట్ ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, నిత్యావసర సరకులు, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కందా వెంకట్రాజు, సోము శివ ప్రసాద్, సుబ్బిరామిరెడ్డి, గంగాధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిరసన



తుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు

తుని: కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను విడనాడాలని అంగన్‌వాడీ వర్కర్స్ అసోసియేషన్ ప్రతినిధులు డిమాండ్ చేశారు. కేంద్రం తీరుపై ఢిల్లీలో జరుగుతున్న ధర్నాకు మద్దతుగా గురువారం తుని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు ధనలక్ష్మి, లలితకుమారి మాట్లాడుతూ కార్మిక చట్టాల్లో మార్పులు చేస్తూ పార్లమెంట్‌లో పాస్ చేసిన బిల్లును రద్దు చేయాలని కోరారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. యూనియన్ నాయకులు లోవరత్నం, మహాలక్ష్మి, రమాదేవి, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

పేదల ఉపాధికి ఊతం

- ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో కూలీల దినసరి వేతనం రూ.15 పెంపు
- రూ.272కి పెరిగిన రోజు కూలి
- ఆనందం వ్యక్తం చేస్తున్న కార్మికులు



డి.పోలవరం చెరువులో పూడిక తీస్తున్న ఉపాధి కూలీలు

తుని రూరల్: మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్)లో దినసరి వేతనం పెంపుతో కూలీల జీవనోపాధి మెరుగుపడనుంది. ఉన్న ఊర్లోనే ఉపాధి పనులు చేసే కూలీలకు ఈ నెల ఒకటి నుంచి దినసరి వేతనం రూ.15 పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పెంపుతో రోజుకూలి రూ.257 నుంచి రూ.272కు పెరిగింది. ప్రభుత్వం ప్రకటించిన గరిష్ట దినసరి వేతనం పొందాలంటే నిర్దేశించిన కొలతల్లో పనులను కూలీలు పూర్తి చేయాల్సి ఉంది. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల పరిధి 11 మండలాల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో సరాసరి రోజు కూలి రూ.257కు గాను కూలీలుక రూ.208 నుంచి రూ.248 వరకూ గిట్టుబాటయ్యింది. దినసరి వేతనం రూ.272లకు పెరగడంతో కూలీలు రోజుకూలి రూ.260కిపైగా పొందే అవకాశం ఉందని ఎంజీఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు తెలిపారు.

మూడు నియోజకవర్గాల్లో...

మెట్ట ప్రాంతమైన తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని 11 మండలాల్లో 204 పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీల్లో 1.19 లక్షల కుటుంబాల వారు ఉపాధి జాబ్‌కార్డులు కలిగి ఉన్నారు. ఈ కుటుంబాలకు చెందిన 1.90 లక్షల మంది కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకుంటున్నారు. వీరంతా వందరోజుల పనిదినాలు పూర్తి చేయనప్పటికీ సంవత్సరంలో కొన్ని దినాలైన ఉపాధి హామీ పథకాన్ని ఉపయోగించుని జీవనోపాధి పొందుతున్నారు. కాగా రోజువారీ కూలీల సంఖ్య 16 వేల నుంచి 20 వేలకు మించడంలేదు. వ్యవసాయ పనుల్లేని సమయాల్లోనే వేలాది మంది కూలీలు ఉపాధి పనులు చేస్తున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్నప్పుడు కూలీల సంఖ్య పరిమితంగా ఉంటోంది. ఒక కుటుంబం గతంలో వంద రోజులు పని చేస్తే రూ.25 వేలు వరకూ లభించగా ఇప్పుడు రూ.27 వేలకుపైగా లభించనుంది. ఉపాధి పనులకు హాజరయ్యే వారిలో మహిళలే అధికంగా ఉంటున్నారు. మెట్టలో సరాసరిగా 55 నుంచి 58 శాతం మంది మహిళలు ఉపాధి పనులు చేస్తున్నారు.

మూడు నియోజకవర్గాల్లో పంచాయతీలు, జాబ్‌కార్డులు, కూలీలు

నియోజకవర్గం	పంచాయతీలు	జాబ్‌కార్డులు	కూలీలు
తుని	62	38,256	64,591
ప్రత్తిపాడు	75	37,278	58,505
జగ్గంపేట	67	43,805	67,435
మొత్తం	204	1,19,339	1,90,531

కూలి రూ.15 పెంచడం ఆనందదాయకం



ఉపాధి హామీ పథకంలో రోజు కూలి రూ.15 పెంచడం సంతోషంగా ఉంది. గత నెల వరకూ చేసిన పనిని బట్టి రోజుకు రూ.248 గిట్టుబాటైంది. ప్రస్తుతం పెరిగిన రేటుతో రూ.260కి పైగా లభించే అవకాశం ఉంది. గరిష్ట కూలి రూ.272 పొందేందుకు గ్రూపులో అందరూ అప్పగించిన పనిని పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తాం.

– పల్లేటి వనుములమ్మ, ఉపాధి కూలీ, డి.పోలవరం

వేసవి అలవెన్సులు పునరుద్ధరించాలి



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గతేడాది వరకూ వేసవి అలవెన్సులు ఇచ్చేవి. ఈ సంవత్సరం పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే ఉపాధి పనులు పర్యవేక్షిస్తూ వేసవి అలవెన్సులు రద్దు చేసింది. ఫిబ్రవరి నుంచి జూన్ వరకూ మండుటెండలో పని చేస్తున్నందున వేసవి అలవెన్సులను మళ్లీ పునరుద్ధరించాలి.

– దొడ్డి రామారావు, ఉపాధి కూలీ, ఎస్‌బీ పేట

రూ.10 కోట్ల విలువైన పనులు సిద్ధం



ఏప్రిల్ ఒకటి నుంచి పెరిగిన కూలి అమల్లోకి వచ్చింది. గ్రామాల్లో అడిగినవాందరికీ పని కల్పిస్తాం. ఈ ఏడాది రూ.పది కోట్ల విలువైన పనులు సిద్ధం చేశాం. ప్రతి కూలీ వందరోజుల పని దినాలు పూర్తి చేయాలి. సకాలంలో చెల్లింపులకు కూలీలందరూ బ్యాంకు ఖాతాలతో ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలి.

– పి.నారాయణరావు, ఏపీఓ, తుని

గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

గోకవరం: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఏపీ గురుకుల పాఠశాలల్లో ఐదో తరగతి, ఇంటర్, డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు భూపతిపాలెం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, కన్వీనర్ బేతపూడి రవి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోకవరం మండలం భూపతిపాలెంలోని బాలురు, తుని మండలం జగన్నాథగిరిలోని బాలికల గురుకుల పాఠశాలల్లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను 5వ తరగతి, ఇంటర్మీడియెట్, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు చెప్పారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీ లోపు ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అప్లై చేసుకున్న వారికి మే 20న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని చెప్పారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని ఒమ్మంగి ఎస్సీ కాలనీలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి బుధవారం ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్ర ప్రసాద్ శంకుస్థాపన చేశారు. తిరుమల తిరుపతి దేవస్థానానికి చెందిన శ్రీవాణి ట్రస్టు నిధులు రూ.10 లక్షలతో సమరత సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ ఆలయ నిర్మాణ పనులు చేపట్టనున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల నేత రామిశెట్టి చినబాబు, సమరత సేవా ఫౌండేషన్ జగ్గంపేట డివిజన్ ధర్మ ప్రచారక్ బుడంకాయల పేర్రాజు, ఎంపీడీఓ ఎస్వీ చలం, మండల కన్వీనర్ కొప్పన కోటేశ్వరరావు, మండల సహాయ కన్వీనర్ తోలేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక సాధికారతే లక్ష్యం



ఏలేశ్వరంలో మహిళలకు నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

- ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్
- డ్వాక్రా మహిళలకు ఆసరా చెక్కుల పంపిణీ

ఏలేశ్వరం: మహిళల ఆర్థిక సాధికారతే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక వెంకటేశ్వరా ఫంక్షన్ హాలులో బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ చేశారు. ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొని పట్టణంలోని 503 డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ.4.49 కోట్ల విలువైన నమూనా చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ వంగా గీత మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారన్నారు. మహిళల అభ్యున్నతి కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి మహిళలకు ఆర్థిక చేయూతను అందించేందుకు కృషి చేస్తున్నారన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలంటే సీఎం జగన్‌కు మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, వైస్ చైర్‌పర్సన్ శిడగం త్రివేణి, మసిరపు బుజ్జి, పార్టీ నాయకులు అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు, బొదిరెడ్డి గోపి, సుంకర రాంబాబు, తొండారపు రాంబాబు, జువ్విన వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీల్లో వసతుల కల్పనకు కృషి



ఏలేశ్వరంలో విద్యుత్ ఉపకేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎంపీ గీత, ఎమ్మెల్యే పర్వత

ఏలేశ్వరం: జగనన్న కాలనీల్లో మౌలిక వసతులు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ అన్నారు. స్థానిక జగనన్న కాలనీలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి బుధవారం ఎంపీ, ఎమ్మెల్యేలు శంకుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేరుస్తున్నారన్నారు. లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి ఉచిత మెటీరియల్‌తో పాటు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైన్లు, విద్యుత్ తదితర వసతులు కల్పిస్తున్నట్టు చెప్పారు. లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ టీవీఎస్‌ఎన్ మూర్తి, డీఈ రత్నాలరావు, ఏఈ సూర్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు, మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, అలమండ చలమయ్య, శిడగం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

కోటనందూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ బుధవారం తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ లగుడు శ్రీనివాసు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, మండలస్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

వైఎస్సార్ సీపీలో 80 మంది చేరిక



జగ్గంపేటలో వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు

జగ్గంపేట: మండలంలోని జగ్గంపేట, రామవరం గ్రామాలకు చెందిన 80 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు బుధవారం వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నేత బోదా శివకుమార్ సారధ్యంలో పార్టీ చేరిన వారికి ఎమ్మెల్యే చంటిబాబు కండువాలు వేసి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్టు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ అన్నివర్గాల సంక్షమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు జ్యోతుల రామస్వామి, జగ్గంపేట ఎంపీపీ అత్తులూరి నాగబాబు, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి, గండేపల్లి ఎంపీపీ చలగళ్ల దొరబాబు, రాష్ట్ర వైఎస్సార్ సీపీ సేవాదళ్ కార్యదర్శి ఒమ్మి రఘురాం, రాష్ట్ర సీడ్ కార్పొరేషన్ డైరెక్టర్ ఇళ్ల అప్పారావు కాపు, జిల్లా సాంస్కృతి విభాగం అధ్యక్షులు పెద్దాడ రాజబాబు, సచివాలయాల మండల కన్వీనర్ బండారు రాజా తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే జోతుల చంటిబాబు 'జగనన్నే మా భవిష్యత్' పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ నెల 7 నుంచి 14 వరకూ జరిగే నియోజవర్గవ్యాప్తంగా జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తీరం.. ఇక వ్యర్థ రహితం

- తీర గ్రామాలను స్వచ్ఛంగా తీర్చిదిద్దేందుకు అరబిందో శ్రీకారం
- తొలి విడతగా రెండు గ్రామాలు ఎంపిక



ఏవీ నగరంలో చెత్త తరలించేందుకు ట్రాక్టర్‌ను అందజేస్తున్న అరబిందో ఫౌండేషన్ ప్రతినిధులు జీవీఎన్ రెడ్డి తదితరులు

తొండంగి: తీర ప్రాంత గ్రామాలను పరిశుభ్రంగా (స్వచ్ఛ గ్రామాలుగా) తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్టు అరబిందో ఫార్మా లిమిటెడ్, ఎన్విరాన్మెంట్, హెల్త్, అండ్ సేఫ్టీ అడ్వైజర్ జేవీఎన్ రెడ్డి తెలిపారు. మండలంలోని ఏవీనగరంలో గురువారం స్వచ్ఛత తీరం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ సుమారు 15 వేల జనాభాతో 3000 కుటుంబాల పరిధిలో తీర ప్రాంతాన్ని ప్లాస్టిక్, వ్యర్థ రహితంగా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. ఇందుకోసం కాకినాడ ఎస్ఈజెడ్ పరిధిలోని పెరుమాళ్లపురం, ఏవీ నగరం పంచాయతీలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్టు చెప్పారు. ఆయా గ్రామాల్లో ఘనవ్యర్థాల నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఇప్పటికే రెండు గ్రామాల పరిధిలో 40 ప్రాంతాలను గుర్తించి, అక్కడ బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా కుండీలను అమర్చామన్నారు. ఈ రెండు పంచాయతీల్లో నిత్యం చెత్తను తరలించేందుకు ట్రాక్టర్లు, ట్రై సైకిళ్లు, గ్రీన్ అంబాసిడర్లను అరబిందో ఫార్మా ఫౌండేషన్ సమకూర్చిందన్నారు. ఏడాది పాటు వాటి నిర్వహణకు అయ్యే వ్యయాన్ని ఫౌండేషన్ భరిస్తోందని చెప్పారు. తీరంలో 15 ఏళ్లుగా పేరుకుపోయిన 150 టన్నుల చెత్తను డంపింగ్ యార్డుకు తరలిస్తామని చెప్పారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్య మురళి మాట్లాడుతూ అరబిందో ఫార్మా ఫౌండేషన్ సేవలు వెలకట్టలేమన్నారు. తీర ప్రాంతాన్ని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు శ్రీకారం చుట్టిన అరబిందో ఫౌండేషన్ డైరెక్టర్ నిత్యానందరెడ్డికి అభినందనలు తెలిపారు. ఉప సర్పంచ్ పిరమళ్ల లోవరాజు, కేఎస్ఈజెడ్ ప్రాజెక్ట్ హెడ్ సీతారామయ్య, స్థానిక ప్రతినిధులు వై. సూర్యారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.



తీర గ్రామాల్లో తడి, పొడి చెత్తల సేకరణకు పంపిణీ చేసిన డస్ట్‌బిన్లు

వైభవంగా పేరంటాలమ్మ జాతర

కోటనందూరు: మండలంలోని టీజే నగరంలో పేరంటాలమ్మతల్లి జాతర మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం నుంచే అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. పరిసర గ్రామాల నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించి మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా సర్పంచ్ సుర్ల రాంబాబు, ఆలయ కమిటీ సభ్యుల సహకారంలో ఏర్పాటు చేసిన బాణసంచా కాల్పులు, రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర నాటకాలు, చిన్నారుల కోలాట ప్రదర్శనలు, డాన్స్ బేబీ డాన్స్ తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి.

ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేత



కాకినాడ జీజీహెచ్‌లో ఆదిలక్ష్మికి పింఛను అందిస్తున్న వలంటీర్ శివ

తొండంగి: మండలంలోని కోదాడ సచివాలయం–2 పరిధిలోని గొర్సపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగ వృద్ధురాలు కాలిన ఆదిలక్ష్మి అనారోగ్యంతో కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతోంది. ఆమె పెన్షన్ లబ్ధిదారు కావడంతో గ్రామ వలంటీరు అంబుజాలపు శివ తన సొంత ఖర్చులతో కాకినాడ ఆసుపత్రికి వెళ్లి పింఛను అందజేశాడు. వలంటీర్ శివను గ్రామ సర్పంచ్, అధికారులు అభినందించారు.

స్ఫూర్తి ప్రదాత జగ్జీవన్‌రామ్



జగ్గంపేటలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే చంటిబాబు



తునిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు



గండేపల్లిలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ దొరబాబు



ఏలేశ్వరంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్

- ఘనంగా మాజీ ఉపప్రధాని జయంతి వేడుకలు
- ఆయన సేవలను కొనియాడిన నేతలు

ఏలేశ్వరం/తుని/తుని రూరల్/జగ్గంపేట/గండేపల్లి/ప్రత్తిపాడు/ప్రత్తిపాదురూరల్/శంఖవరం/కోటనందూరు/కిర్లంపూడి/గోకవరం/తొండంగి: దేశ మాజీ ఉప ప్రధానమంత్రి బాబూ జగ్జీవన్‌రామ్‌ను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్ సూచించారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో బుధవారం బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఏలేశ్వరం పెద్దవీధి ఎస్సీపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఎంపీ వంగా గీత, ఎమ్మెల్యే పర్వత ప్రసాద్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. జగ్జీవన్‌రామ్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియడారు. నేటి యువత జగ్జీవన్‌రామ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. జగ్గంపేటలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. బలహీన వర్గాల కోసం ఆయన చేసిన సేవలను కొనియాడారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైస్ ఎంపీపీ చోడిశెట్టి సత్యనాగేశ్వరరావు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. గండేపల్లి మండల పరిషత్ కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీపీ చలగళ్ల దొరబాబు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగత శివ ఆధ్వర్యంలో న్యాయవాదులు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రత్తిపాడు మండలం గజ్జనపూడిలో అరుందతి యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు నిర్వహించారు. విశ్రాంత ఐపీఎస్ అధికారి డాక్టర్ కె.రాజా శిఖామణి ఆధ్వర్యంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శంఖవరం మండలం జి.కొత్తపల్లిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైస్ ఎంపీపీ ఈగల చిన్నమ్ములు ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనరు చింతకాయల చినబాబు, ఈఓపీఆర్డీ అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. కిర్లంపూడిలో జగ్జీవన్ రామ్ విగ్రహానికి ప్రియదర్శిని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. గోకవరం ఠానా సెంటర్ సమీపంలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకులు వరసాల ప్రసాద్, సుంకర వీరబాబు ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుని వీరవరపుపేటలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జిల్లా వక్ఫ్ బోర్డు వైస్ చైర్మన్ షేక్ క్వాజా పాల్గొన్నారు. తొండంగి మండలం బెండపూడిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ ఆరుమిల్లి ఏసుబాబు, వ్యవసాయ సలహామండలి మండలాధ్యక్షుడు ఎం.వీరవెంకట సత్యనారాయణచౌదరి ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు.